
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 24 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య



అసెంబ్లీలో పాలకొండ్రాయుడుకు సంతాపం


అసెంబ్లీలో సంతాపం తెలుపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-రాయచోటి

మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభల రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడుకు సంతాపం తెలియజేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు పాలకొండ్రాయుడి రాజకీయ ప్రస్థానం, రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు గురించి వివరించారు. రెండు నిముషాలు సభ మొత్తం నిలబడి మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండరాయుడు కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలి

- కెఎఫ్‌సి ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దేశ ప్రధాని నరేంద్రమోడీ దాసోహంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం పట్టణంలో అమెరికా కంపెనీ కెఎఫ్‌సి ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్1బి వీసాను లక్ష డాలర్లకు పెంచడం అంటే అమెరికాలో ఉన్న భారతీయులను ఇంటికి పంపించే కుట్రలో భాగమేనన్నారు. గతంలో విధించిన సుంకాలపైన, ఇప్పుడు ట్రంప్ జారీచేసిన హెచ్1బి వీసా పైన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎక్కడ కూడా జాతి నుద్దేశించి మాట్లాడిన పరిస్థితి లేదన్నారు. విదేశాలకు చెందిన నిపుణులకు అమెరికా జారీ చేసే హెచ్1బి వీసా ఫీజును ఎకాఎకిన లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) పెంచుతూ ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచంలో పెను సంచలనం రేపగా, ఆ మర్నాడే నష్ట నివారణా చర్యగా పెంచిన రుసుం కొత్త దరఖాస్తులకు మాత్రమేనని, ఒకేసారి, చెల్లించాల్సిన పనిలేదని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, వైట్ హౌస్ వేర్వేరుగా వివరణ లిచ్చాయని పేర్కొన్నారు. స్థానిక అమెరికన్లకే ఉద్యోగాలని, కుహనా జాతీయ వాదాన్ని ప్రజల్లో రెచ్చగొట్టి అధికారంలో కొచ్చిన ట్రంప్, అధికారం చేపట్టిందే మొదలు ప్రతీకార, కక్ష పూరిత, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. హెచ్1బి వీసాదారుల్లో 71 శాతం మంది మన దేశస్థులే ఉన్నారన్నారు. 24 గంటల్లోనే కొత్త రుసుం అమల్లోకి రావడంతో వేలాది మంది యువత దిక్కుతోచని స్థితికి లోనయ్యారని తెలిపారు. మన విదేశాంగ శాఖ కనబర్చిన ప్రతిస్పందనకు యువత ఆశాజనకంగా లేరని పేర్కొన్నారు. అమెరికా నిర్ణయాన్ని



కెఎఫ్‌సి ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గట్టిగా ప్రతిఘటించాల్సిన ఈ సమయంలో మోడీ స్వదేశీ వస్తువులు, స్వావలంబన మాటలు చెప్పడం దారుణమని పేర్కొన్నారు. అమెరికా భారతదేశ వస్తువుల దిగుమతులపై సుంకాలు వేసిన సందర్భంలోనూ మోడీ సర్కార్ ఇలాగే తటపటాయింపు ధోరణిని అవలంభించిందని చెప్పారు. ట్రంప్-మోడీ ఫోన్‌లో తరచూ హాయ్ చెప్పుకుంటారని, పరస్పరం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటారని అమిత ప్రచారం సాగుతున్న దశలో హెచ్1 బి వీసాల ఫీజు తగ్గింపుపై మోడీ ఎందుకు ట్రంప్‌పై ఒత్తిడి చేయలేకపోతున్నారో ఆయన చెబితేనే తెలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి హరినాథ్ శర్మ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, సుల్తాన్, కార్తికేయ, చరణ్, ప్రవీణ్, కైఫ్, గోవర్ధన్, వేదాంత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

దీపం సబ్సిడీ జమకాని వివరాలు సేకరించండి

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న దీపం పథకం సబ్సిడీలో జమకాని వివరాలను సేకరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దీపం పథకం రెండో విడత (ఏప్రిల్-జూలై)కు సంబంధించి, సబ్సిడీ అమౌంట్ లబ్ధిదారుల ఖాతాలలో జమకాని అంశంపై జెసి అధ్యక్షతన ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సబ్సిడీ అమౌంట్ జమ కాకపోయిన కేసుల జాబితాను పరిశీలించగా, అధిక సంఖ్యలో కేసులు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఆధార్ నంబర్ అనుసంధానం కాకపోవడం వల్ల ఏర్పడినవిగా గుర్తించనట్లు తెలిపారు. ఆధార్ నంబర్ ఇనాక్టివ్ అయినవీ, ఆధార్ నంబర్ బ్యాంక్ ఖాతాతో లింక్ కానివి కూడా ఉండడం వల్ల సబ్సిడీ జమ కాకపోయినట్లు తెలిపారు. లబ్ధిదారుల వద్ద రెండు లేదా అంతకన్నా ఎక్కువ బ్యాంక్ ఖాతాలు ఉండటంతో ప్రాథమిక ఖాతా నిర్దేశం లేకపోవడం వల్ల సబ్సిడీ జమ కాకపోతున్నట్లు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు ఈ అంశంపై నిశిత పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు తమ ఏజెన్సీ పరిధిలోని సబ్సిడీ


మాట్లాడుతున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

అమౌంటు జమకాని లబ్ధిదారుల వివరాలను సేకరించి, ఒక ప్రత్యేక డ్రైవ్ ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్న ఆదేశాలు జారీ చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వారిని ఎన్‌పిసిఐతో ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వై.సుమతి పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి

ప్రజాశక్తి-మదనపల్లె

అవగాహనతోనే హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం అవుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ముఖ్యంగా మహిళలు, బాలికలు, ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు. సమాజంలో ఎయిడ్స్ వ్యాప్తి నివారణకు విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కళాశాలలో తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం విద్యా వాతావరణంపై మంచి ప్రభావం చూపుతుందని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని తెలిపారు. అది అంటించుకునే వ్యాధి అని చెప్పారు. దీనికి శాశ్వత మందులు లేవన్నారు. నివారణే ఒక్కటే మార్గమని వివరించారు. ఎయిడ్స్ నిర్మూలనలో మహిళలు, బాలికల పాత్ర అమోఘమని కొనియాడారు. ఆర్ఆర్ఎస్ మేనేజర్ పురుషోత్తం మాట్లాడుతూ హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకూడదని వీడియోలు ద్వారా వివరించారు. ఎపిశాక్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శివ పార్వతి దేవి, సతీష్‌రెడ్డి, రమణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆర్ఆర్ఎస్ సిబ్బంది జనార్ధన్, కిరణ్, రెడ్డిబాష, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎఫ్ మిస్సింగ్ క్రెడిట్లను జమ చేయాలి


జిల్లా పరిషత్ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉమ్మడి కడప జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ స్లిప్పులలో జమ కాని నెలలకు మిస్సింగ్ క్రెడిట్‌లను వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేసి వాటిని ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు ఎ.వి.రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలో జిల్లా పరిషత్ పరిపాలనాధికారి విజయభాస్కర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నల్లమల రామాంజులు, మహమ్మద్ రఫీలతో కలిసి సంబేపల్లి మండల ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు జమ కాని డిసెంబర్ 2021, జనవరి 2022లకు సంబంధించిన వివరాలను అందజేసి వెంటనే వాటిని ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమచేసి, ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ వివరాలను 2024-2025 సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌ల్లో పొందుపరచాలని, ఉద్యోగుల తమ అవసరాలకై దరఖాస్తు చేసిన రుణాలు, అంతిమ చెల్లింపుల దరఖాస్తులను వారంలోగా మంజూరు చేయాలని కోరమని తెలిపారు. జిల్లా పరిషత్ అధికారులు సానుకూలంగా స్పందించారని భవిష్య నిధి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచడానికి ప్రయత్నిస్తామన్నారు. ఉద్యోగుల రుణాలు అంతిమ చెల్లింపులను కార్యాలయ సిబ్బంది వీలైనంత త్వరగా మంజూరు చేసేలా కృషి చేస్తామని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులకు అధికారులు తెలిపారు.


కర్నూల్ రేంజ్ డిఐజికి పూల మొక్కను ఇస్తున్న ఎస్‌పి ధీరజ్

డిఐజిని కలిసిన ఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ కునుబిల్లి మంగళవారం కర్నూల్ రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ను కర్నూల్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న కార్యకలాపాలు ప్రజా భద్రతా చర్యలు నేర నియంత్రణ పట్ల అనుసరిస్తున్న వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా డిఐజి కోయ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజా భద్రత ప్రథమ కర్తవమని దీనిని ప్రతి పోలీసు అధికారి గుర్తించాలన్నారు. బాధితులకు వేగవంతమైన న్యాయమందించడం ద్వారా పోలీసులపై ప్రజలు విశ్వాసాన్ని ఉంచుతారని విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ ప్రజలకు భద్రత కలిగిన భరోసా కల్పించాలన్నారు. నేరాల నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతికను ఉపయోగించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల దాకా పోలీసులు ప్రజలకు చేరువ కావడం అత్యంత అవసరమని సూచించారు. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ సూచనల మేరకు జిల్లాలో ప్రజలకు మరింత చేరువై పోలీసింగ్ అందించడానికి కృషి చేస్తామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లాలో ప్రజా భద్రత శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నివారణలో జిల్లా పోలీసులు అహర్నిశలు కృషి చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు : సర్పంచ్

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణ ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన పట్టణ పారిశుధ్య పరిస్థితులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, సిబ్బందితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల ఫలితంగా గుంటల్లో నీరు నిల్వ ఉండి, దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ ప్రజలకు జ్వరం, ఇతర అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పట్టణంలోని చెత్తాచెదారాలను తొలగించడంతోపాటు నీటి గుంటలో నీటి నిల్వలు లేకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు క్రమం తప్పక తాగునీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా తీసుకోవాలని తెలియజేశారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, మేస్త్రీలు రాము, భాస్కర్, సుహేల్, నీటి సరఫరా సిబ్బంది డి.వెంకట్రామయ్య, మస్తాన్, మన్సూర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కడప సిటీ: ప్రజల్లో ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్తలు ఎంతో అవసరమని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున తెలియజేశారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం వారు ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు ఫార్మక విజిలెన్స్ కార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని రామిరెడ్డి కళాశాల ఆఫ్ ఫార్మసీ, నర్సింగ్ కళాశాల, ఇతర విద్యాసంస్థల్లో ఔషధాల దుష్ప్రభావాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో ముగింపు సందర్భంగా మంగళవారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలు జయపతి, ఫార్మకాలజీ శ్రీలలిత, పద్మావతిల బహుమతులను అందుకున్నారు. కార్యక్ర మంలో ఫార్మకాలజీ ఇన్‌ఛార్జి హెచ్‌ఒడి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, పీజీ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చలు

- అన్ని డిమాండ్లు పరిష్కరిస్తామని నాయకులకు ఎస్ఇ హామీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు కడప జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం విద్యుత్ ఎస్ఇతో నగరంలోని విద్యుత్ భవనంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించారు. నాయకుల డిమాండ్లపై ఎస్ఇ స్పందంచారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ పైడ్ హాలిడేస్ ఇస్తామని తెలిపారు. అన్ని డివిజనులకు బడ్జెట్ పంపమని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ లందరికీ ఐటిఐ విద్యార్హతలు ఉన్న వారి పేర్లు కోర్టుకు వెళ్లిన కార్మికులకు, కోర్టుకు పోకపోయినా లిస్టు తయారు చేసి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని సిఎండి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రొద్దుటూరు, మైదుకూరు డివిజన్, కడప, పులివెందుల సబ్ స్టేషన్ పరిధిలోని మోటర్లు బోర్లు కాంపౌండ్ వాల్ ఫినిషింగ్లు సేఫ్టీ మెటీరియల్స్ అన్నీ కూడా ఎస్టిమేషన్ వేసి తొందరగా పని అయ్యేటట్లు చేస్తానని పేర్కొన్నారు. కంట్రోల్ రూములు మైదుకూరు డివిజన్‌లోని ముత్తులూరుపాడు వరికుంట్ల కాలవకట్ట పని మొదలు పెడతామని చెప్పారు. పులివెందుల డివిజన్‌లోని ప్రతి కాంట్రాక్టు కార్మికునికి పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని ఇప్పటికే ఒకరికి ఇస్తున్నామని, మిగతా అందరికీ ఇస్తామని చెప్పారు. డి.అగ్రహారం నరసింహారెడ్డికి ఒక సంవత్సరం పాటు రావాల్సిన జీతం కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ మొదటి వారంలో అవగాహన సమావేశాలు పెట్టి ఇన్సూరెన్స్, జీతాలకు వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని, ఇతర కార్డులు, కార్మికుడికి భద్రతగా ఇన్సూరెన్స్ చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు. చర్చల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి.సి.కొండయ్య, పులివెందుల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, చంద్రమౌళి, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా నాయకులు నబిరాయుడు, అధికారులు పర్సనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, జెఎఒ జగన్మోహన్‌రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. అన్ని విషయాలు చర్చించి మీకు న్యాయం చేస్తామని చెప్పిన ఎస్ఇ వెంకట్ రమణకి ధన్యవాదాలు తెలిపారు. సమస్యలు అక్టోబర్ 10వ తేదీ లోపు పరిష్కరించకపోతే సిఎండి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు.

షాహినాజ్ బేగంకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లయిడ్ మ్యాథమెటిక్స్ స్కాలర్ వి.షాహినాజ్ బేగంకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ఆ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో 'నానోఫ్లూయిడ్‌ల ఉష్ణప్రసరణ ఉష్ణ బదిలీపై స్నిగ్ధత, క్రియాశీలత శక్తి ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు తెలిపారు. ఈమె రాసిన ఐదు పరిశోధన పత్రాలు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కేర్ లిస్టులో ప్రచురితమయ్యాయి. స్కాలర్ షాహినాజ్ బేగంను ఈ సందర్భంగా వైవీయూ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అభినందించారు.

వైద్య కళాశాలలను పరిరక్షించాలి


ప్రజాశక్తి-రాయచోటి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, ఆసుపత్రులను ప్రయివేటుపరం(పిపిపి) కాకుండా ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, అఖిలపక్ష కమిటీలు ఏర్పాటు చేసుకోని సంఘటితంగా పోరాడి పరిరక్షించుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక జిఇ 590 రద్దు చేసే వరకూ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులుగా నిరాహార దీక్షలు చేపట్టి ప్రజలకు నాయకత్వం వహించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయలసీమ ద్రోహపు చర్యలను నిలువరించడానికి రాష్ట్రంలోని ప్రజాస్వామ్యక వాదులంతా మౌనం విడాలన్నారు. ముఖ్యమంత్రి రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైన ప్రభుత్వానికి ప్రజా ఆరోగ్యానికి రూ.ఆరు వేల కోట్లు కేటాయించడం పెద్ద భారమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సిన మెడికల్, పారామెడికల్ ఉద్యోగ అవకాశాలు శాశ్వతంగా ప్రయివేటు పరం చేసేందుకే మొదలెట్టిన ప్రయత్నాన్ని ఆపేందుకు నిరుద్యోగ యువత ఉద్యమాలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వైద్య విద్య, వైద్య సేవలను వ్యాపారంగా మార్చేసి శాశ్వతంగా పేద, మధ్యతరగతి ప్రజలకు దూరం చేయవద్దని కోరారు. సంఘటితంగా పోరాడుదాం, ప్రభుత్వ ప్రజారోగ్య వ్యవస్థను పరిరక్షించుకుందామని మునుముందుకు సాగుదామన్నారు.

నేడు పూనా ఒప్పంద దుర్దినం సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బ్రిటిష్ వారితో పోరాడి సాధించిన కమ్యూనల్ అవార్డును హరించిన సెప్టెంబర్ 24ను పూనా ఒప్పంద దుర్దినమని, బిసికె, బాస్ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విసికె, బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూనా ఒప్పందం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు లభించిన రాజకీయ ప్రాతినిధ్యం, అగ్రకుల రాజకీయ పార్టీలకు ఊడిగం చేసే చెంచాలను తయారు చేయగా, లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు విద్య, ఉద్యోగ, ఆరోగ్య రంగాలను వాణిజ్య కరించడంతో రిజర్వేషన్లు ఉండి కూడా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కమ్యూనల్ అవార్డు కోల్పోయి 93ఏళ్లు అవుతున్న సందర్భంగా రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అన్న అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అందులో భాగంగా బుధవారం స్థానిక కదిరి రోడ్డులోని, సూర్య టవర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. విసికె, బాస్ నాయకులు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు: స్మార్ట్ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందించడానికే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పీలేరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనాథ్‌రెడ్డి, బిసి నాయకుడు పోలిశెట్టి సురేంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్టలో ఉన్న 2వ నెంబరు చౌక దుకాణంలో లబ్ధిదారులకు వారు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సున్నితమైన సమాచారాన్ని సురక్షితంగా నిల్వ చేసే, తద్వారా ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా లబ్ధిదారులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని అంకాళమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జయచంద్రా రెడ్డి షామియానా జయన్న, రెడ్డి ముని, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు



ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పీలేరులో పోలీసులు విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పీలేరు

అసాంఘిక శక్తుల నిర్మూలనే లక్ష్యంగా పీలేరులో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్లు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. మంగళవారం పీలేరు పట్టణంలో జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, ప్రముఖ కేంద్రాలు, కార్యాలయాలు, రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, వారపు సంత, తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ యుగంధర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అసాంఘిక శక్తుల నిర్మూలనకు ముందస్తు చర్యలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

నేటి నుంచి టైటానిక్‌షిప్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ ప్రజలను కనువిందు చేసేందుకు టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాష చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు యజమాని సి.కె.దినేష్ కుమార్, కో-ఆర్డినేటర్ కె.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఎగ్జిబిషన్లలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన టైటానిక్ ఎగ్జిబిషన్ పట్టణంలో ఏర్పాటు చేస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎగ్జిబిషనులోకి ప్రవేశించిన వెంటనే టైటానిక్ షిప్‌లో ప్రయాణం చేసిన గొప్ప అనుభూతి పొందుతారన్నారు. జైయింట్ వీల్, బేబీ ట్రైన్, మ్యూజిక్ చైర్స్ వంటి వాటిలో పిల్లలు పెద్దలు సరదాగా గడపవచ్చునన్నారు. నోరూరించే తినుబండారాలు, గృహ అవసరాలకు ఉపయోగపడే వస్తువులు ఎగ్జిబిషన్‌లో లభిస్తాయన్నారు. చిన్నారులను అబ్బురపరిచే విధంగా ఘోస్ట్ హౌస్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా సందర్శించి ఆనందం, ఆహ్లాదకర పరిస్థితులను ఆస్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, మేనేజర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

'భాష్యం' గుర్తింపును రద్దు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

పుంగనూరు భాష్యం పాఠశాల గుర్తింపును రద్దుచేసి, విద్యార్థిని సాత్విక నాగశ్రీకి న్యాయం చేయాలని ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ్ తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ వర్క్ చేయలేదనే కారణంతో విద్యార్థినిని కొట్టి తలకు గాయం చేసిన ఉపాధ్యాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వెంటనే అరెస్టు చేసి, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాత్విక నాగశ్రీ తల్లి ఒంటరి మహిళని, ఆమెకు ఎలాంటి ఆర్థిక స్తోమతలేదని ప్రభుత్వం, విద్యాశాఖ మరింత బాధ్యతగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి తన సొంత జిల్లాలో జరిగిన సంఘటనపై స్పందించాలని, సాత్విక కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, లోకేష్, యశ్వంత్, రాజేష్, కార్తీక్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు



మురుగునీరు తొలగించడంతో శుభ్రంగా ఉన్న రోడ్డు

మురుగు నీరు తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కలకడ

సంబేపల్లి మండలం ఎస్.సోమవరం పంచాయితీ దేవలంపేటలో రోడ్డుపై ఉన్న మురికి నీటిని సర్పంచ్ పాల వెంకటరమణ, ఎంపిటిసి రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో 'దోమలకు ఆవాసాలుగా మురుగు నీరు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి దేవలంపేట గ్రామానికి వెళ్లి పరిశీలించి రోడ్డుపై ఉన్న మురుగునీటిని తొలగింపజేశారు. ఈ రోడ్డు ద్వారా నిత్యం వాహనాలు, విద్యార్థులు, పాదాచా రులు వెళుతుంటారని మురుగునీరు నిల్వ ఉండటం వల్లే ఇబ్బంది పడే వారని చెప్పారు. అధికారులు స్పందించి మురికి నీరు తొలగించి దారిని ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు తమ సంతోషం వ్యక్తం చేశారు.



కలికిరి : రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం యూత్ రెడ్ క్రాస్, కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని దాదాపు 120 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఇ.ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూత్ రెడ్‌క్రాస్ (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో విలువైనవని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంచి తీర్చిదిద్దుతాయన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ త్యాగరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.అర్జున, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** మనం చేసే రక్తదానంతో అత్యవసర సమయాల్లో ఓ నిండు ప్రాణం నిలబడుతుందని మెడికల్ ఆఫీసర్ తేజస్విని అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన గణేశ్ యూత్ సభ్యులను వైద్యాధికారి తేజస్విని,డాక్టర్లు అమర్ సింహ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడి మురళి

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం లోని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం 20వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ ఆడిట్ సిబ్బంది ఉపాధి సిబ్బంది, కన్వర్జెన్సీ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడి మురళి మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డు వివరాలను పరిశీలించి దృవీకరించినట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో వెళ్లి సోషల్ ఆడిట్ ప్రజా ప్రతినిధులను కలిసి ఆడిట్ ప్రారంభించాలని తెలిపారు. ప్రతి గ్రామసభలో జరిగినటువంటి ఆడిట్ పైన గ్రామ సభ నిర్వహిస్తారు. ఈ గ్రామ సభకు సర్పంచ్ సెక్రటరీలు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రామాపురం : మండల పరిధిలోని కుమ్మరపల్లి పంచాయతీ సురవాండ్లపల్లె 132 కెవి సబ్ స్టేషన్‌లో మండలానికి వచ్చు 33కెవి లైన్ బ్రేకర్ కొత్తది మార్పుచేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామాపురం ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయము ఉంటుందన్నారు. మండల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించగలరని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక ఇషా కంటి ఆసుపత్రి సహకారంతో పట్టణంలోని భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 110 మంది కంటి వైద్య పరీక్షలు హెల్పింగ్ మైండ్స్ సభ్యులు తెలిపారు. ఇందులో 40మందిని కంటి ఆపరేషన్లకు వైద్య నిపుణులు ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు కంటి వైద్యశిబిరం నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. యువత సేవా కార్యక్రమాలలో ముందుండి ఇలాంటి సేవా నిరతితో సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 13 ఏళ్ల నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. బి.కొత్తకోట ప్రాంత వాసులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందని, తల్లిదండ్రులు చిన్నపిల్లల పట్ల కూడా మొబైల్ ఫోన్ వాడకం పై జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కంటి వైద్య శిబిరానికి సహకరించిన ఇషా కంటి ఆసుపత్రి వైద్య నిపుణులకు, పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కంటి వైద్య శిబిరం ప్రత్యేకంగా చొరవ చూపిన సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఇషా కంటి ఆస్పత్రి నిపుణులు వెంకటేష్, చైతన్య, భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, ముఖ్తియార్, సంఘ సభీజ్, ఇంతియాజ్, విష్ణు, సమీర్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోళ్ల ఫారంపై అధికారుల చర్యలు

- ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రజలకు, ప్రజా ఆరోగ్యానికి ఇబ్బందిగా మారిన కోళ్ల ఫారంపై చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ రమేష్‌బాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రెడ్డివారిపల్లి గ్రామంలోని పెట్టావాండ్లపల్లి సమీపంలో గోపాల్‌రెడ్డికి చెందిన కోళ్ల ఫారంను ఓ ప్రయివేట్ సంస్థకు లీజుకు ఇవ్వగా వారు అందులో కోళ్లను పెంచుతున్నట్లు తెలిపారు. కోళ్ల ఫారం నుంచి వచ్చే కోళ్ల వ్యర్థాలతో, చనిపోయిన కోళ్లను బయటపడవేయడంతో, కోళ్ల ఫారం వద్ద పరిశుభ్రంగా ఉంచకపోవడంతో ఈగలు విస్తారంగా వృద్ధి చెంది గ్రామాన్ని చుట్టుముట్టాయన్నారు. ఆ వ్యర్థాల నుంచే వచ్చే దుర్వాసన, ఈగలతో గ్రామంలోని ప్రజలు భరించ లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యా ర్థులు మధ్యాహ్న భోజనం చేయాలన్న ఈగల ప్రభావంతో వారు తీవ్ర అవస్థలు పడు తున్నారని తెలిపారు. ఈగల ధాటికి ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని గ్రామస్తులు తహశీల్దార్ తపస్వినికి, ఎంపిడిఒకు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు తహశీల్దార్, ఎంపిడిఒ క్షేత్రస్థాయిలో కోళ్ల ఫారం ను సందర్శించి పరిసరాలను పరిశీలించి ఈగల నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రతకు వెంటనే పటిష్ట చర్యలు చేపట్టాలని కోళ్ల ఫారం యాజమాన్యాన్ని ఆదేశించడం జరిగిందన్నారు. వారు ఈగల నివారణకు తగిన చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో గ్రామస్తులు మరోసారి అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. కోళ్ల ఫార ను మరోసారి డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఆర్ఐ రమేష్ కలసి సందర్శించి పరిశీలించగా ఈగల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోవడంతో ఈగల ఉత్పత్తి మరింత ఎక్కువ అయ్యి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందోని బహిరంగ విచారణలో తెలిసిందన్నారు. కోళ్ల ఫారం యజమాని గోపాల్‌రెడ్డికి కోళ్లను ఖాళీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం కోళ్ల ఫారం లో 12 వేల కోళ్లు ఉన్నాయని రోజుకు రెండు వేల కోళ్ల చొప్పున 15 రోజులలో మొత్తం కోళ్లను ఇక్కడ నుంచి ఖాళీ చేయాలని ఆదేశాలను జారీ చేశామన్నారు. కోళ్ల ఫారం యజమాని కూడా లీజుకు ఇచ్చిన ప్రైవేటు సంస్థతో సంప్రదించి కోళ్లను ఖాళీ చేయించడానికి, కోళ్ల వ్యర్థాలను తొలగించడానికి అంగీకరించారని తెలిపారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఆర్ఐ రమేష్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, విఆర్ఒ నాగరాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోళ్ల ఫారంపై బహిరంగ విచారణ చేపడుతున్న అధికారులు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటసిద్దయ్య

ప్రజాశక్తి-సుండుపల్లి

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తన శాయశక్తుల కృషి చేస్తానని ఉపాధ్యాయుడు నంద్యాల వెంకట సిద్దయ్య పేర్కొన్నారు. సుండుపల్లె గ్రామపంచాయతీ, పెద్దపల్లికి చెందిన ఉపాధ్యాయుడు నంద్యాల వెంకటసిద్దయ్య విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతమైన స్థితికి చేర్చాలన్నదే తన లక్ష్యమన్నారు. మల్లువాండ్లపల్లె ఎంపిపి పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. పాఠశాలలో మొక్కలు నాటించడం, గుణాత్మక విద్యను అందించడం, పిల్లలకు నాణ్యమైన భోజనాలు పెట్టించడంలో బాధ్య తగా పని

ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహం
ఉపాధ్యాయుడు నంద్యాల వెంకటసిద్దయ్య



చేస్తున్నట్లు తెలిపారు. ముల్లవాండ్లపల్లె నుంచి శ్రీనివాసపురంకు బదిలీ అవు తున్న సమయంలో గ్రామస్తులు చూపిన అభిమానం మరువ లేనిదన్నారు. అక్కడ కూడా విద్యార్థులకు మంచి నడవడికలు నేర్పించడం, వెనుకబడిన విద్యా ర్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యా భోదన చేసినట్లు తెలిపారు. అనంతరం చింతల య్య గారిపల్లె ప్రాథమిక పాఠశాలలో దాతల సాయం తో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, నోటుపుస్తకాలు వంటి విద్యా సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. తాను చదివిన సుండుపల్లె జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతిలోఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.1.50 లక్షలు నగదు రూపంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒతో కలిసి అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం బాలిరెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత 25 ఏళ్లుగా తన వృత్తిని దైవంగా భావించి చిన్నపిల్లలే దైవ సమానమని, సొంత బిడ్డల వలె విద్యా భోధన చేస్తు న్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా, మండల అధికారుల నుంచి అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకోవడంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల ఉన్నతి కోసం ఉపాధ్యాయ వృత్తి ధర్మాన్ని తప్పకుండా పాటిస్తానన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో?

- అధ్వానంగా వంగిమళ్ల రోడ్డు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రం వీరబల్లి నుంచి వంగిమళ్ళకు వెళ్లేందుకు వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పోరు చెన్నారెడ్డిగారిపల్లి దగ్గర ఉండే గంగనేరు కల్వర్టులో తాత్కాలికంగా తోలిన గ్రావెల్ చిన్న పాటి నీటికి కొట్టుకుపోయింది. వాహనదారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు ఆ దారిన వెళ్లాలంటే కింద పడిపోయి కాళ్లు చేతులు విరిగిపోతాయేమో అన్న భయం వేస్తుందన్నారు. తాత్కాలికంగా వాహనాలు పోవడానికి, ప్రభుత్వ ఉద్యోగులు రావడానికి, గ్రావెల్ తోలాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నిమార్లు పత్రికలో ప్రచురించిన వార్తలు వచ్చాయి. అధికారులు, పాలకులు, ప్రభుత్వాలు చూసి చూడనట్టు పోతున్నాయి. ఈ రోడ్డు అధికారులకు పట్టించుకోరా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చి ధర్నా నిర్వహించక ముందే తాత్కాలికంగా గ్రావెల్ తవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



బురదనీటితో నిండిన రోడ్డు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : సిడిపిఒ



తంబళ్లపల్లి : మాట్లాడుతున్న సిడిపిఒ సుజాత

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల పరిధిలోని రెడ్డివారిపల్లి కన్నెమడుగు పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను అక్టోబర్ 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సిడిపిఒ సుజాత తెలిపారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. పౌష్టికాహారం గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలింత ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని, ఆ తర్వాత అదనపు ఆహారాన్ని బిడ్డకి అలవాటు చేయాలని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డ అనుబంధం ఏర్పడు తుందని, తల్లి పాల వల్ల కొన్ని వ్యాధులను నుంచి కాపాడవచ్చు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రక్తహీనత పోషకాహార లోపాలపై ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ జోహార్‌బి పేర్కొ న్నారు.లక్కిరెడ్డిపల్లి సిడిపిఒ కార్యాలయం పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిడిఎఒ మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు, గర్భవతులు పాలిచ్చు తల్లులు పోషకాహార జాగ్రత్తలు పాటించి ఆరోగ్యపరమైన మెరుగైన అలవాట్లు పాటించాలని అన్నారు. పిల్లలు పాలు ఇచ్చి తల్లులు, గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, మునగాకు వంటి పోషకులు ఆహారం తీసుకొని రక్తహీనతకు దూరంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు కార్యక్ర మంలో సూపర్‌వైజర్లు దాదిబి, రూప, హుస్సేనమ్మ, సుజాత, సోని, శారదా, శివ, సుబ్బమ్మ, ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవరోజు పార్వతి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.మూడవ రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ గజలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్ తెలిపారు. **వీరబల్లి :** మండలంలో విజయ దర్గమ్మ శరన్నవరాత్రి మహోత్స వంలో భాగంగా రెండవ రోజు అమ్మవారు మాతంగి బ్రహ్మచారినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. సద్గురు సరస్వతీ నంద మాట్లాడుతూ అక్టోబర్ 3న విజయదుర్గమ్మను గ్రామంలో వైభవంగా ఊరేగింపు ఉత్సవాలు తెలిపారు. ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. గాలివీటి సోదరులు అన్న దాన కార్యక్రమం నిర్వహిoచారు. **వాల్మీకిపురం:** మండలంలోని గండబోయనపల్లికోటలో శ్రీ సత్య మ్మతల్లి ఆలయంలో రెండవ రోజు శ్రీ సత్యమ్మ తల్లి గాయత్రీ దేవి అలంక రణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ వారిని ఉదయం సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలునిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించడంతో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి, సద్దల చక్రపాణి, ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్, చంద్రశేఖర్, చిన్నప్పరెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, పూజారి ఉత్తన్న, భక్తులు పాల్గొన్నారు.



నందలూరు: పార్వతీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరిదేవి

బూత్ కమిటీ అధ్యక్షుడిగా చాంద్‌బాషా

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండల వైసిపి బూత్ కమిటీ అధ్యక్షుడిగా చాంద్‌బాషా నియమితులయ్యారు. మండల వైసిపి బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా చాంద్ భాషా మాట్లాడుతూ తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిలకు సహకారంతో మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలపై పోరాడుతానని తెలిపారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. వైసిపికి పూర్వవైభవం తెచ్చి మరల వై.ఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెప్పారు.పార్టీ ఆదేశానుసారం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా అధైర్య పడమని అన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి సక్రమంగా అమలుచేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అరొకరగా అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. తనకు ఈ పదవి దక్కేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డితో చాంద్‌బాషా



సంతమార్కెట్‌లో బురదమయంగా ఉన్న రోడ్డు

వర్షం వచ్చిందంటే కూరగాయల సంత చిత్తడే చిత్తడి

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

వర్షం వచ్చిదంటే మండల కేంద్రం గాలివీడులోని కూరగాయల సంత చిత్తడి చిత్తడి మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి కూరగాయల సంత, బస్టాండు, గొర్ల సంత గేటు వల్ల యేడాదికి రూ.40 నుంచి రూ.50లక్షల వరకు ఆదాయం వస్తుంది. ముఖ్య ఆదాయ వనరుగా ఉన్న సంత మార్కెట్‌లో మౌలిక వసతులు ఏమాత్రం లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంతలోకి వెళ్లడానికి ప్రధాన రహదారి నుంచి సిసి రోడ్ కూడా లేకపోవడంతో బురదలోనే వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు బురదలో జారిపడి ప్రమాదాల బారినపడుతున్నారని చెబుతున్నారు. కూరగాయల సంతలో ఆరు వరుసలలో కూరగాయలు దుకాణాలు ఏర్పా టు చేసుకున్నారు. వర్షం వచ్చిందంటే రైతులు, మహిళలు, వ్యాపారస్తులు, కూరగా యాలు తడవాల్సిందేనని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి కూరగాయల సంత అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.



లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందిస్తున్న టిడిపి నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-రామాపురం

స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలను ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సరస్వతిపల్లె సొసైటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోనిచిట్లూరు పంచాయతీ చెనిక్కాయలపల్లెలో మంగళవారం 33 చౌకదు కాణాల డీలర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ స్మార్ట్ కార్డుల విధానాన్ని ప్రవేశ పెట్టిం దన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడే వారికి, వృద్ధులకు ఈనెల 26 నుంచి ఇంటి వద్దకు రేషన్ సరుకులు తీసుకుపోయి, స్మార్ట్ రేషన్‌కార్డులను అందిస్తారని తెలిపారు. ఈ స్మార్ట్ కార్డు వల్ల ప్రతి లబ్ధిదారుడు ఒకటో తేదీ నుంచి నెల చివరి వరకు నిత్యావసర సరుకులు తీసుకెళ్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవదర్శన్‌రెడ్డి సహదేవరెడ్డి, రామకృష్ణగౌడ్, గణేష్, ప్రభాకర్, లక్ష్మయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

రెడ్డమ్మకొండ హుండీ ఆదాయం రూ.1.82 లక్షలు

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని ,చెర్లోపల్లి గ్రామం రెడ్డెమ్మ దేవత దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,82,701లు వచ్చిందని ఇఒ మంజుల పేర్కొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయం సంబంధించి నెలా పదిరోజులకు హుండీ లెక్కింపు చేపట్టినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని వాయల్పాడులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో దేవాదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ పర్యవేక్షణలో లెక్కించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-నందలూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుప డాల ని ఎన్ఎస్ ఎస్పిఒ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పేర్కొన్నారు.ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నందలూరు గ్రామపంచాయతీలోని అరుంధతివాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో అన్నమాచార్య ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొని కమ్యూనికేషన్ స్కిల్స్ మీద అవగాహన కలిగించారని అన్నారు. దేశ భవిత యువత మీదనే ఆధారపడి ఉందని, యువకులు సామాజిక సేవలో పాల్గొనడం శుభపరిణామన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

క్రైం కార్నర్

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘట మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చాకిళ్లవారిపల్లెకు చెందిన వెంకట్రమణ(58) కుటుంబ సమస్యలపై మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య కృష్ణవేణి ఉంది.

మరో యువకుడి..

మదనపల్లె అర్బన్ : తల్లి మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేంపల్లికు చెందిన హిమగిరి ఇంటర్ వరకు చదివి, ప్రస్తుతం మెకానిక్‌గా పనికి వెళ్తున్నాడు. గత కొంతకాలంగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండడంతో తల్లి మందలించింది.తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.